
'సర్'కు సమాయత్తం 2





3 బస్సు ఆపలేదని రాయితో దాడి



AKSHARA TODAY

అక్షర టుడే

TOWARDS... TRUTH, TRUST, TREND

www.aksharatoday.in


## డీఆర్‌వోను కలిసిన జీపీవోలు



**అక్షరటుడే, నిజామాబాద్ సిటీ:** జిల్లా రెవెన్యూ అధికారిణి గీతను గురువారం జీపీవోలు మర్యాదపూర్వకంగా కలిశారు. తమ ప్రొబేషన్, ఇంక్రిమెంట్లు, మ్యూచ్‌వల్ ట్రాన్స్‌ఫర్లు, ఇతర సమస్యలను ఆమెకు విన్నవించారు. కార్యక్రమంలో జీపీవో అసోసియేషన్ నాయకులు పృథ్వీ, కిషన్, ప్రశాంత్, లక్షణ్, అమృత్, జీవన్, రమేష్, నవనీత, రాకేష్, వరుణ్ తదితరులు పాల్గొన్నారు.





# నత్త నడకన రైల్వే పనులు

**కామారెడ్డి రైల్వే స్టేషన్ అభివృద్ధికి అమృత్ భారత్ 2.0 పథకం కింద కేంద్ర ప్రభుత్వం రూ.39.84 కోట్లు మంజూరు చేసింది. నిధులు మంజూరైనా కామారెడ్డి రైల్వే స్టేషన్ ఆధునీకరణ పనులు మాత్రం రెండేళ్లుగా నత్తనడకన సాగుతున్నాయి. దీంతో ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. పనులు పూర్తయితే చూడాలని పట్టణవాసులు ఎదురు చూస్తున్నారు. అయితే అది కలగానే మిగిలిపోతుంది. ఇప్పట్లో పనులు పూర్తయ్యే అవకాశాలు కనిపించడం లేదన్న టాక్ వినిపిస్తోంది.**

**- అక్షరటుడే, కామారెడ్డి**





■ అమృత్ పథకానికి ఎంపికైన కామారెడ్డి రైల్వే స్టేషన్ ■ రెండేళ్లుగా సాగుతున్న పనులు ■ బిల్లులు రాక మధ్యలోనే నిలిచిపోతున్న వైనం

కేంద్ర ప్రభుత్వం అమృత్ భారత్ 2.0 పథకం కింద తెలంగాణ రాష్ట్రంలోని పలు రైల్వే స్టేషన్లకు నిధులు మంజూరు చేసింది. అందులో భాగంగానే కామారెడ్డి రైల్వే స్టేషన్ అభివృద్ధికి రూ.39.84 కోట్లు కేటాయించింది. ఆ నిధులతో స్టేషన్‌లో ఆధునిక వసతులు కల్పిస్తామని అధికారులు తెలిపారు. అయితే నిధులు మంజూరై ఏళ్లు గడుస్తున్నా పనుల్లో మాత్రం పురోగతి కనిపించడం లేదు.

### బిల్లులు రాక..

కేంద్ర ప్రభుత్వం నిధులు మంజూరు చేయడంతో పనులకు శ్రీకారం చుట్టారు. అక్కడక్కడా మొదలైన పనులు కాంట్రాక్టర్లకు బిల్లులు సకాలంలో విడుదల కాకపోవడంతో ఎక్కడికక్కడ నిలిచిపోయాయి. నిధులు మంజూరైనా, బిల్లుల చెల్లింపులో జాప్యం కారణంగా దాదాపు రెండేళ్లుగా పనులు అసంపూర్తిగానే ఉన్నాయి. దాంతో రైల్వే అభివృద్ధి పనులపై నీలినీడలు అలుముకున్నాయన్న టాక్ వినిపిస్తోంది.

### మధ్యలో వదిలేసి..

రైల్వే అభివృద్ధిలో భాగంగా మోడల్ రైల్వే స్టేషన్ ఇలా ఉంటుందని ఊహాజనిత మ్యాప్ ఒకటి విడుదల చేశారు. దాని ప్రకారం స్టేషన్‌లో వివిధ పనులకు శ్రీకారం చుట్టారు. స్టేషన్‌లో ఏ పనిని చేపట్టినా దాన్ని పూర్తి చేయకుండా మధ్యలోనే వదిలేస్తున్నారు. దీంతో స్టేషన్ అంతా అస్తవ్యస్తంగా, నిర్మాణ వ్యర్థాలతో నిండిపోయి ప్రయాణికులకు ఇబ్బందిగా మారింది.

### సగంలోనే ఓవర్ బ్రిడ్జి, లిఫ్ట్ పనులు

స్టేషన్‌లో ప్రయాణికుల సౌకర్యార్థం గతంలోనే ఒక ఫుట్ ఓవర్ బ్రిడ్జి నిర్మించారు. దానికి ఇటీవల లిఫ్ట్ ఏర్పాటు చేశారు. ప్రస్తుతం మరొక బ్రిడ్జి పనులు మొదలు పెట్టారు. ప్లాట్‌ఫారాల మధ్య రాకపోకలకు కీలకమైన ఫుట్ ఓవర్ బ్రిడ్జి పనులు సగంలోనే నిలిచిపోయాయి. లిఫ్ట్ పనులు కొనసాగుతూనే ఉన్నాయి. దీంతో వృద్ధులు, దివ్యాంగులు, మహిళలు ఇబ్బందులు పడుతున్నారు. కొన్ని రోజులుగా రైల్వే స్టేషన్‌లో తాగునీటి కొరత తీవ్రంగా మారింది. వేసవిలో సైతం ప్లాట్‌ఫారంపై తాగునీటి సౌకర్యం లేదు.

### పార్కింగ్ సౌకర్యం కరువు

రైల్వే స్టేషన్ ఆవరణలో వాహనాల పార్కింగ్ స్థలంలో కేవలం ఫ్లోరింగ్ పనులు చేసి వదిలేశారు. గతంలో ఉన్న పార్కింగ్ కూల్చేశారు. వాటి స్థానంలో కార్లు, బైకుల కోసం పార్కింగ్ ఏర్పాటు చేయడానికి ఫ్లోరింగ్ వేసి పిల్లర్లు నిర్మించి వదిలేశారు. ప్రస్తుతం పార్కింగ్ షెడ్లు, లైటింగ్, భద్రతా సౌకర్యాలు లేకపోవడంతో ఎండలోనే వాహనాలు నిలపాల్సి వస్తుందని వాహనదారులు ఆందోళన చెందుతున్నారు. స్టేషన్‌లో లిఫ్టులతో పాటు ఎస్కలేటర్ ఏర్పాటు చేస్తామని ప్రకటించారు. అయితే అది కేవలం ప్రకటనలకు మాత్రమే పరిమితమైంది.





## సర్వసభ్య సమావేశానికి కాంగ్రెస్ కౌన్సిలర్ల డుమ్మా..!

**అక్షరటుడే, ఆర్మూర్:** ఆర్మూర్ మున్సిపల్ ఛైర్‌పర్సన్ గోనె లహరి అధ్యక్షతన గురువారం సర్వసభ్య సమావేశం నిర్వహించారు. అయితే కాంగ్రెస్ నుంచి 11 మంది కౌన్సిలర్లు గైర్హాజరయ్యారు. ఈ ఘటన సర్వత్రా చర్చనీయాంశమైంది. సొంత పార్టీ కౌన్సిలర్లే సమావేశానికి హాజరుకాకపోవడంతో వెంటనే ఓ కాంగ్రెస్ ప్రజాప్రతినిధి రంగంలోకి దిగారని సమాచారం. ప్రత్యేకంగా భేటీ అయిన 11 మంది కౌన్సిలర్లను ఆయన బుజ్జగించే ప్రయత్నం చేశారని తెలిసింది. అంతర్గతంగా ఏవైనా విభేదాలుంటే తర్వాత మాట్లాడుకుందామని ముందుగా సర్వసభ్య సమావేశానికి హాజరు కావాలని కోరినట్లు సమాచారం. ప్రస్తుతం ఛైర్‌పర్సన్ వ్యవహరిస్తున్న తీరుపై 11 మంది కౌన్సిలర్లు ఆగ్రహం వ్యక్తం చేసినట్లు సమాచారం. ముందుగా సర్వసభ్య సమావేశానికి రావాలని.. తర్వాత మాట్లాడదామని చెప్పడంతో వారు సమావేశానికి హాజరయ్యారు. 11 గంటలకు ప్రారంభం కావాల్సిన సర్వసభ్య సమావేశం గంట ఆలస్యంగా ప్రారంభమైంది.

## జూన్ 2లోగా ఇందిరా మహిళా శక్తి భవనాన్ని అప్పగించాలి



**అక్షరటుడే, నిజామాబాద్ సిటీ:** ఇందిరా మహిళా శక్తి భవనం పనులు వేగంగా పూర్తిచేసి జూన్ 2లోగా అప్పగించాలని కలెక్టర్ ఇలా త్రిపాఠి అధికారులను ఆదేశించారు. నగరంలోని కలెక్టరేట్ సమీపంలో అధునాతన హంగులతో నూతనంగా నిర్మించిన భవన సముదాయాన్ని గురువారం ఆమె సందర్శించారు. తుది దశకు చేరుకున్న నిర్మాణ పనులను, వాటి నాణ్యతను పరిశీలించారు. పనులను వేగవంతంగా పూర్తి చేయించాలని, జూన్ 2వ తేదీ లోపు భవన సముదాయాన్ని సంబంధిత శాఖ అధికారులకు అప్పగించాలని పంచాయతీరాజ్ ఇంజినీరింగ్ అధికారులను ఆదేశించారు. ఇందిరా మహిళా శక్తి భవనం చుట్టూ ప్రహరీ నిర్మించాలని సూచించారు. పనులను నాణ్యతతో పూర్తి చేయించి, సకాలంలో అందుబాటులోకి తీసుకురావాలన్నారు. స్వయం సహాయక సంఘాల మహిళలకు శిక్షణ, ఉత్పత్తుల మార్కెటింగ్‌కు ఈ భవనం దోహదపడనున్నందున ప్రభుత్వం నిర్దేశించిన విధంగా అన్ని సదుపాయాలు అందుబాటులో ఉండేలా చూడాలని ఆదేశించారు. కలెక్టర్ వెంట డీఆర్డీవో సాయన్న, జిల్లా పంచాయతీరాజ్ అధికారి బావయ్య, ఈఈ వీరానంద్, మెప్మా ఏపీడీ మధుసూదన్ తదితరులున్నారు.

## పైప్‌లైన్ లీకేజీలకు శాశ్వత పరిష్కారం చూపాలి : ఎమ్మెల్యే



**అక్షరటుడే నిజామాబాద్ సిటీ:** నగరంలోని మిర్చి కాంపౌండ్‌కు వెళ్లే దారిలో తాగునీటి పైప్‌లైన్ లీకేజీకి శాశ్వత పరిష్కారం చూపాలని అర్బన్ ఎమ్మెల్యే ధన్‌పాల్ సూర్యనారాయణ అధికారులను ఆదేశించారు. నగరంలోని మార్వాడి గల్లీ, మిర్చి కాంపౌండ్‌లలో మున్సిపల్ కమిషనర్ దిలీప్ కుమార్, పబ్లిక్ హెల్త్ డీఈ శ్రీకాంత్‌తో కలిసి పరిశీలించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ.. మూడు రోజులుగా తాగునీటి పైప్‌లైన్ లీకేజీకి గురైందని, దీంతో మురికి నీరు కలుషితమై నల్లాల్లోకి వస్తున్నాయన్నారు. ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నా అధికారులు స్పందించకపోవడం తగదన్నారు. ఏళ్లుగా ఉన్న పాత లైన్‌ను సర్వే చేపట్టి శాశ్వత పరిష్కారం చూపాలని పేర్కొన్నారు. నూతన పైప్‌లైన్ వేసి ప్రజలకు ఇబ్బందులు లేకుండా చూడాలన్నారు. వీలైనంత త్వరగా పనులు పూర్తి చేయాలని ఆదేశించారు. సంబంధిత అధికారులు సైతం కార్పొరేటర్లకు, ప్రజలకు జవాబుదారులుగా ఉండాలని సూచించారు. అలాగే మిర్చి కాంపౌండ్‌లో చేతిపంపులకు మరమ్మతులు చేయించి అందుబాటులోకి తీసుకురావాలని సూచించారు. వేసవిలో తాగునీటి ఇబ్బందులు లేకుండా చూడాలన్నారు. ప్రధానంగా గంజ్ కమాన్ వద్ద గత కొన్ని రోజులుగా నెలకొన్న డ్రెయినేజీ సమస్య ఎక్కడ వేసిన గొంగళి అక్కడే అన్న చందంగా మారిందని ఎమ్మెల్యే అన్నారు. టెండర్లు పూర్తయినా పనులు ఎందుకు ప్రారంభించలేదని కమిషనర్‌ను ప్రశ్నించారు. కాంట్రాక్టర్ నిర్లక్ష్యం చేస్తే బ్లాక్ లిస్టులో పెట్టాలని సూచించారు. వచ్చే మూడు రోజుల్లో పనులు పూర్తి కావాలని ఆదేశించారు. ఎమ్మెల్యే వెంట స్థానిక కార్పొరేటర్ బంటు ప్రీతి ప్రవీణ్, కార్పొరేషన్ ఏఈ శ్రీకాంత్, సిబ్బంది తదితరులున్నారు.



## విజయవాడ కనక దుర్గమ్మ సేవలో రూరల్ ఎమ్మెల్యే

**అక్షరటుడే, నిజామాబాద్ సిటీ:** విజయవాడ కనకదుర్గమ్మను రూరల్ ఎమ్మెల్యే భూపతిరెడ్డి దర్శించుకున్నారు. ఆయనతో పాటు తెలంగాణ ఎన్నారై కమిటీ ఛైర్మన్ వినోద్ కుమార్, వైస్ ఛైర్మన్ మంద భీమ్ రెడ్డి తదితరులు సైతం అమ్మవారి సేవలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆలయ అర్చకులు ఎమ్మెల్యేతో పాటు కమిటీ ప్రతినిధులకు ఆశీర్వచనాలు అందజేశారు. కార్యక్రమంలో తెలంగాణ ప్రభుత్వ ఎన్నారై కమిటీ మెంబర్లు సింగిరెడ్డి నరేష్ రెడ్డి, నంగి దేవేందర్ రెడ్డి, చెన్నమనేని శ్రీనివాస రావుతో పాటు మాజీ ఐడీసీఎంఎస్ ఛైర్మన్ సాయిరెడ్డి, రాష్ట్ర గీత కార్మిక సహకారం కార్పొరేషన్ ఛైర్మన్ చంద్ర శేఖర్ గౌడ్, ప్రొఫెసర్లు జునుగురు శ్రీనివాస్, విజయ్ కొర్రా, ప్రవాసీ ప్రజావాణి కో–ఆర్డినేటర్ బొజ్జ అమరేందర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## కులగణనపై సుప్రీంకోర్టు తీర్పు హర్షణీయం



**అక్షరటుడే, ఇందూరు:** జాతీయ జనగణనలో బీసీ కులగణన కూడా చేపట్టవచ్చని సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పును స్వాగతిస్తున్నామని బీసీ సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షులు నరాల సుధాకర్ అన్నారు. సుప్రీంకోర్టు తీర్పు కులగణన వ్యతిరేకులకు చెంపపెట్టులాంటిదన్నారు. ఈ మేరకు నగరంలో విలేకరుల సమావేశం నిర్వహించారు. తెలంగాణ బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు జాజుల శ్రీనివాస్ గౌడ్ ఆధ్వర్యంలో చేసిన పోరాట ఫలితంగానే సుప్రీంకోర్టు బీసీ కులగణన చేయాలని తీర్పు ఇచ్చిందని నరాల సుధాకర్ అన్నారు. దేశవ్యాప్తంగా బీసీ జనాభాను లెక్కించాలని, జనాభాలో సగభాగానికి పైగా ఉన్న బీసీలకు రాజ్యాంగబద్ధమైన హక్కులు దక్కాలని తాము దశబ్దాలుగా పోరాటం చేస్తున్నామన్నారు. దాని ఫలితమే ఈరోజు సుప్రీంకోర్టు తీర్పు అని పేర్కొన్నారు. సుప్రీంకోర్టు తీర్పుతోనైనా కేంద ప్రభుత్వం ప్రస్తుతం మొదటి దఫా జరుగుతున్న కుటుంబాల లెక్కింపులో బీసీ కుటుంబాల లెక్కింపు చేపట్టాలని డిమాండ్ చేశారు. సమావేశంలో నగర అధ్యక్షుడు దర్శనం దేవేందర్, నాయకులు కరిపె రవీందర్, మాడవేడి వినోద్ కుమార్, కొయ్యాడ శంకర్, సాయి బసవ, కొట్టూరు చంద్రకాంత్, శ్రీలత, బగ్గలి అజయ్, సుర్నార్ విజయ్, చెరుకు లక్ష్మణ్ గౌడ్, సురేందర్, దేశాయి గంగాధర్ తదితరులు పాల్గొన్నారు.

## కాళేశ్వరం పుష్కరాలకు వెళ్లేవారికి గుడ్‌న్యూస్..

**నిజామాబాద్ నుంచి ప్రత్యేక బస్సు ఏర్పాటు**

**అక్షరటుడే, ఇందూరు:** కాళేశ్వరం పుష్కరాల సందర్భంగా టీజీఎస్ ఆర్టీసీ ప్రత్యేక చర్యలు చేపట్టింది. భక్తుల రద్దీని దృష్టిలో ఉంచుకొని కాళేశ్వరానికి ప్రత్యేక బస్సును ఏర్పాటు చేసింది. ఈ మేరకు గురువారం ఆర్ఎం జ్యోత్స్న వివరాలు వెల్లడించారు. కాళేశ్వరం పుష్కరాలకు గురువారం నుంచి వచ్చే 12 రోజుల పాటు భక్తుల సౌకర్యార్థం ప్రత్యేక సర్వీసు నడపనున్నట్లు ఆర్ఎం తెలిపారు. నిజామాబాద్ నుంచి ఉదయం 5 గంటలకు ప్రత్యేక బస్సు కాళేశ్వరానికి బయలు దేరుతుందన్నారు. టికెట్ ఛార్జ్ కేవలం రూ.380లుగా నిర్ణయించామని.. భక్తుల రద్దీకి అనుగుణంగా ఏర్పాట్లు చేయనున్నట్లు చెప్పారు. భక్తులు టీజీఎస్ ఆర్టీసీ సేవలను వినియోగించుకోవాలన్నారు. సౌకర్యవంతంగా, సురక్షితంగా ఉండేందుకు భక్తులు టీజీఎస్ ఆర్టీసీ బస్సుల్లోనే ప్రయాణించాలని కోరారు.

## గంజాయి సాగుకు అనుమతివ్వండి.. సహనం కోల్పోయి రైతుల డిమాండ్



**అక్షరటుడే, కామారెడ్డి:** అధికారుల తీరుపై రైతులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. కొనుగోలు కేంద్రాల్లో కాంటా అయిన ధాన్యం కూడా తరలించకపోవడంపై ఆందోళన బాట పడుతున్నారు. ధాన్యం విక్రయాలతో ఇబ్బందులవుతున్నాయని.. తమకు గంజాయి సాగుకు అనుమతివ్వాలని రైతులు డిమాండ్ చేశారు. దీంతో అవాక్కవడం అధికారుల వంతైంది. ఈ ఘటన కామారెడ్డి మున్సిపాలిటీ పరిధిలోని అడ్లూర్ ఎస్సీ కాలనీలో గురువారం చోటు చేసుకుంది. కాలనీలో ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రంలో నెల రోజుల నుంచి ధాన్యం కుప్పలు తరలించకపోవడంపై రైతులు ఆగ్రహం వ్యక్తం చేస్తూ ఆందోళన చేయడానికి నిర్ణయించారు. విషయం తెలుసుకున్న సివిల్ సప్లయ్స్ అధికారి వెంకటేశ్వర్లు, డీఎం శ్రీకాంత్ ఇతర అధికారులు హుటాహుటిన గ్రామానికి చేరుకుని రైతులు ఆందోళనకు వెళ్లకుండా ఆపగలిగారు. సివిల్ సప్లయ్ అధికారులతో రైతులు వాగ్వాదానికి దిగారు. 'దళారులను నమ్మవద్దని అధికారులే చెప్తారని.. తీరా కొనుగోలు కేంద్రానికి తీసుకొస్తే నెలలుగా కేంద్రంలోనే వడ్లు డంప్ చేయడం ఏమిటని' వారు ప్రశ్నించారు. ఇటు కేంద్రాల్లో.. అటు రైస్‌మిల్లుల్లో దోచుకుంటున్నారని ఆగ్రహించారు. 'ధాన్యం రైస్ మిల్లులకు పంపించడం మీ వల్ల కాకపోతే గంజాయి అయినా సాగు చేసుకుంటాం. వచ్చే యాసంగిలో గంజాయి పండించడానికి అనుమతి ఇవ్వండి. అప్పుడు ఏ బాధ ఉండదు' అంటూ అధికారులపై విరుచుకుపడ్డారు. దాంతో అధికారులు తెల్లముఖం వేశారు. కాంటా చేసిన ధాన్యం రైస్ మిల్లుకు వెళ్తే ఔటాన్ పేరిట 4 నుంచి 10 క్వింటాళ్లు కోత విధిస్తున్నారని కర్షకులు కన్నెర్ర చేశారు. ఇలా అయితే మేమెట్లా బతకాలి అంటూ నిలదీశారు. దీంతో అధికారులు స్పందిస్తూ ఇకనుంచి ఎలాంటి సమస్య రాకుండా చూస్తామని, ఎప్పటికప్పుడు ధాన్యం తరలిస్తామని చెప్పడంతో రైతులు శాంతించారు.



## పెర్కిట్‌లో బడిబాట

**అక్షరటుడే, ఆర్మూర్ :** ఆర్మూర్ మున్సిపల్ పరిధిలోని పెర్కిట్ ఉన్నత పాఠశాలలో బడిబాట కార్యక్రమాన్ని గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా పాఠశాల ప్రధానోపాధ్యాయుడు మద్దికుంట శ్రీనివాస్ మాట్లాడుతూ.. ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థుల సంఖ్యను పెంచాలని ఉపాధ్యాయులకు సూచించారు. అలాగే అంగన్‌వాడీ టీచర్లు, ఏఎన్ఎంలు ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వ పాఠశాలలో అంది స్తున్న సౌకర్యాలను వివరించాలన్నారు. కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు, అంగన్‌వాడీ టీచర్లు తార, స్రవంతి, లక్ష్మి, రమణ, సహెదా, ఏఎన్ఎంలు అరుణ, కవిత, రజిత పాల్గొన్నారు.

## ఇందూరు తిరుమలలో స్వర్ణామృత ప్రాశన ఔషధ ప్రసాద సేవ



**అక్షరటుడే, ఇందూరు:** నర్సింగ్‌పల్లిలోని ఇందూరు తిరుమల గోవింద వనమాలక్షే త్రంలో పుష్యమి నక్షత్రం సందర్భంగా చిన్నారుల కు స్వర్ణామృత ప్రాశన ఔషధ ప్రసాద సేవ నిర్వ హించారు. ఈ సంద ర్భంగా దిల్ రాజు, శిరీష్‌ల సోదరుడు నర సింహారెడ్డి మాట్లాడు తూ.. ఆలయాలంటే కేవలం దైవదర్శనాలే కాదు.. సాంస్కృతిక కేంద్రాలు, సమాజంలో స్పృహ కల్పించే జ్ఞాన భాండాగారాలని తెలిపారు. ఔషధాలకు కేరాఫ్ అడ్రస్‌గా ఇందూరు తిరుమల ఆల యం నిలుస్తోందన్నారు. మాఘ పౌర్ణమి రోజు సంతాన ప్రాప్తి కోసం ఔషధం తీసుకున్న దాదాపు ప్రతి ఒక్క జంట తల్లిదండ్రులుగా మారడం శాస్త్రజ్ఞులకు కూడా అందని విషయమేనన్నారు. పుష్యమి నక్షత్రం రోజు వేలాదిమంది చంటి బిడ్డలకు స్వర్ణామృత ప్రాశన దివ్య ఔషధాన్ని ఇస్తూ ఆరోగ్యకరమైన, పటిష్టమైన, శారీరక దారుఢ్యం గల భావి భారత పౌరులను తయారు చేస్తున్నామన్నారు. ఆధ్యాత్మిక ప్రకృతి సేద్యం చేస్తూ మన ఆహారమే ఔషధమని ఇందూరు తిరుమల గోవింద వనమాల క్షేత్రం చాటి చెబుతోందని ఆయన చెప్పారు. కను మరుగవుతున్న ఎన్నో ఫలాల వృక్షాలను పెంచుతూ, ఎన్నో ఔషధ మొక్కలకు ఆలయ ప్రాంగణంలో ప్రాణం పోస్తు ఆధునిక ధన్వంతరి గా ఆలయం నిలుస్తోందని వివరించారు.

## ఆలూర్‌లో కొనసాగుతున్న 'గృహ గణన'




**అక్షరటుడే, ఆర్మూర్:** ఆలూర్ మండల కేంద్రంలో సెన్సస్-2027 గృహ గణన కార్యక్రమం కొనసాగుతోంది. ఈ సందర్భంగా వివరాల నమోదు ప్రక్రియను సెన్సస్ అడిషనల్ ఛార్జ్ ఆఫీసర్ నరేందర్ పరిశీ లించారు. ఇంటింటికీ వెళ్లి వివరాలను నమోదు చేసే ప్రక్రియను క్షు ణ్ణంగా పరిశీలిస్తూ, ప్రతి కుటుంబ వివరాలను తప్పులులేకుండా నమోదు చేయాలని సిబ్బందికి సూచించారు. అనంతరం నరేందర్ మాట్లాడుతూ.. సెన్సస్‌లో ప్రతి ఇంటి వివరాలను సక్రమంగా నమోదు చేయడం ద్వారా గ్రామాభివృద్ధి ప్రణాళికలు, ప్రభుత్వ సంక్షేమ పథకాల అమలులో కచ్చితత్వం సాధ్యమవుతుందని తెలిపారు. ప్రజలు కూడా సిబ్బందికి సరైన సమాచారం అందించి సహకరించాలని కోరారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్ రాజేష్, ఎన్యూమరేటర్ వెంకటేశ్వర్ పాల్గొన్నారు.

# 'సర్'కు సమాయత్తం..

**ఓటర్ల ప్రత్యేక సమగ్ర సవరణ (ఎస్ఐఆర్)కు జిల్లాలో అధికార యంత్రాంగం సమాయత్తం అవుతోంది. కేంద్ర ఎన్నికల సంఘం ఆదేశాలతో 'సర్'లో భాగంగా బీఎల్వోలు ఇంటింటికీ తిరుగుతూ జూన్ 25 నుంచి జులై 24 వరకు ఓటరు జాబితా సమగ్ర సవరణ ప్రక్రియ చేపట్టనున్నారు.**

**– అక్షరటుడే, డిచ్‌పల్లి**



■ జూన్ 25 నుంచి చేపట్టేందుకు సన్నద్ధం ■ ఏర్పాట్లు చేస్తున్న అధికారులు

జిల్లావ్యాప్తంగా జరగనున్న 'సర్' ప్రక్రియలో బోగస్ ఓటర్లు, రెండు చోట్ల ఓటుహక్కు కలిగి ఉన్న వారి వివరాలు బహిర్గతమయ్యే అవకాశం ఉంది. ఒక కుటుంబంలోని సభ్యులందరి ఓట్లు ఒకే పోలింగ్ కేంద్రంలో ఉంచాలనేది ఈ ప్రత్యేక సమగ్ర సవరణ ఉద్దేశంగా అధికారులు పేర్కొంటున్నారు. ఈ సందర్భంగా బోగస్ ఓట్లను తొలగించేందుకు అధికారులు ప్రణాళిక వేస్తున్నారు. ఎన్నికల సంఘం నిర్దేశానుసారం అన్ని విధాలా అర్హతలు కలిగి ఉండి, ఓటరు జాబితా నుంచి తొలగిస్తే.. సంబంధిత ఓటరుపై అధికారులకు అప్పీలు చేసుకునే అవకాశం కల్పించనుండటం గమనార్హం.

### మ్యాపింగ్ ఇలా..

ఓటరు జాబితాల ప్రత్యేక సమగ్ర సవరణ కోసం 2002లో సమగ్ర సర్వే అనంతరం రూపొందించిన జాబితాతో పాటు 2025లో ఓటరు జాబితాలో నమోదైన వారి వివరాలను సిబ్బంది పరిశీలించనున్నారు. అలాగే ఈ వర్గాలను ఏ, బీ, సీ, డీ కేటగిరీలుగా విభజించి సవరణ చేస్తున్నారు. పోలింగ్ కేంద్రాల అధికారులు (బీఎల్వోలు) ఈ ప్రక్రియ చేపట్టనున్నారు. 39 ఏళ్లకు పైబడి.. 2002 జాబితాలో ఓటరుగా నమోదైన వారు 'ఏ' కేటగిరీలో, 39 ఏళ్ల వయస్సుకు పైబడిన 2002 ఓటరు జాబితాలో పేరు లేని వారి వివరాలను 'బీ' కేటగిరీలో చేర్చనున్నారు. 21 నుంచి 38 ఏళ్లలోపు వయసున్న వారిని 'సీ' కేటగిరీలో, 18 నుంచి 20 ఏళ్ల వయస్సుండి.. 2004 తరువాత జన్మించి వారి జాబితాను 'డీ' కేటగిరీలో చేర్చనున్నారు.

**పూర్తి స్థాయిలో సన్నద్ధత**

జిల్లా కలెక్టర్ ఇలా త్రిపాఠి క్షేత్రస్థాయిలో రెవెన్యూ అధికారులతో ఇదివరకే సమావేశాలు నిర్వహించారు. ఇంటింటి సర్వే చేపట్టేందుకు దిశానిర్దేశం చేశారు. నియోజకవర్గాల్లో ఓటరు మ్యాపింగ్ ప్రక్రియ కొనసాగుతోంది. ఓటర్ల గుర్తింపు బీఎల్వోలకు సవాల్‌గా మారింది.

**నియోజకవర్గాల వారీగా ఓటర్లు**

| | |
|---|---|
| ఆర్మూర్ | 2,1 4,136 |
| బోధన్ | 2, 24,772 |
| బాన్సువాడ | 1,98 ,738 |
| నిజామాబాద్ అర్బన్ | 3,07,459 |
| నిజామాబాద్ రూరల్ | 2,60,485 |
| బాల్కొండ | 2,29,624 |

## 'అభివృద్ధిని చూసి ఓర్వలేక పోతున్నారు..'



**అక్షరటుడే, లింగంపేట:** ఎల్లారెడ్డి నియోజకవర్గ అభివృద్ధిని చూసి బీఆర్ఎస్ నాయకులు ఓర్వలేకపోతున్నారని.. కాంగ్రెస్ లింగంపేట మండలాధ్యక్షుడు గోకుల్ సాయిరాం అన్నారు. అనవసరంగా ఎమ్మెల్యేపై అసత్య ప్రచారాలు మానుకోవాలని సూచించారు. లింగంపేట కాంగ్రెస్ కార్యాలయంలో గురువారం విలేకరులతో మాట్లాడారు. గత పదేళ్లు పరిపాలించిన బీఆర్ఎస్ ఎలాంటి అభివృద్ధి చేయకపోవడంతో ప్రజలు ఓడించి మూలకు కూర్చోబెట్టారన్నారు. బీఆర్ఎస్ అధికారంలో ఉన్నప్పుడు పోల్కంపేట్ చౌదరి చెరువుకు గండిపడి మూడేళ్లు గడిచినా ఎలాంటి చర్యలు తీసుకోలేదన్నారు. కాంగ్రెస్ అధికారంలోకి రాగానే ఎమ్మెల్యే మదన్‌మోహన్ ఆధ్వర్యంలో వెంటనే మరమ్మతులు చే యించారని గుర్తు చేశారు. మాజీ ఎమ్మెల్యే జాజాల సురేందర్ సొంత గ్రామమైన నల్లమ డుగులో కొన్నేళ్లుగా మురికికాల్వల సమస్య ఉండేదని ఎమ్మెల్యే మదన్ మోహన్ వచ్చాకే డ్రెయినేజీల నిర్మాణం పూర్తయిందన్నారు. లింగంపల్లి వంతెన, మల్లారం చెరువు, పోల్కంపేట్ చౌదరి చెరువుల మరమ్మతులకు నిధులు మంజూరయ్యాయని చెప్పారు. వెంటనే పనులు ప్రారంభమవుతాయని రైతులు అధైర్య పడవద్దని ఆయన పేర్కొన్నారు. కార్యక్రమంలో మార్కెట్ కమిటీ వైస్ ఛైర్మన్ రాజు, పీసీసీ మైనార్టీ కార్యదర్శి రఫీయొద్దీన్, నారా గౌడ్, సర్పంచ్‌ల ఫోరం అధ్యక్షుడు సక్రు, ప్రసాద్ గౌడ్, కుండా బాలకిషన్, సేవ్యా, ఎల్లమయ్య, రాజు శ్రీనివాస్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

నిజామాబాద్ నగరంలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో..



పోతంగల్ మండల కేంద్రంలో..



భీమ్‌గల్ పట్టణ కాంగ్రెస్ కార్యాలయంలో..



## రాజీవ్‌గాంధీ సేవలు మరువలేం..

**దివంగత మాజీ ప్రధాని రాజీవ్ గాంధీ దేశానికి చేసిన సేవలు మరువలేనివని వక్తలు అన్నారు. ఉమ్మడి జిల్లాలో రాజీవ్‌గాంధీ వర్ధంతిని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటాలు, విగ్రహాలకు ఘనంగా నివాళులర్పించారు. సాంకేతిక విప్లవాన్ని దేశానికి అందించింది రాజీవ్ గాంధీ అని.. మహిళలకు రాజకీయాల్లో కూడా స్థానం ఉండాలని, మహిళా రిజర్వేషన్లను తీసుకొచ్చిన గొప్ప నాయకుడు ఆయన అని కొనియాడారు.**


**– అక్షరటుడే, వెబ్‌డెస్క్**



ఎల్లారెడ్డి ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ..



కమ్మర్‌పల్లి మండల కేంద్రంలో..



కల్లెడలో..

## డిచ్‌పల్లి రైల్వే స్టేషన్‌లో 'స్వచ్ఛతా పక్వాడా'



**అక్షరటుడే, డిచ్‌పల్లి:** మండల కేంద్రంలోని రైల్వే స్టేషన్ ఆవరణలో 'స్వచ్ఛతా పక్వాడా' కార్యక్ర మాన్ని మిట్టపల్లి పవర్ గ్రిడ్ కార్పొరేషన్ సీనియర్ డీజీఎం ప్రభాకర్ గురువారం ప్రారంభించారు. ఈ సందర్భంగా పవర్ గ్రిడ్ ఉద్యోగులు రైల్వే స్టేషన్ పరిసర ప్రాంతాల్లో పిచ్చిమొక్కలను తొలగించి శుభ్రపర్చారు. అనంతరం సీనియర్ డీజీఎం ప్రభాకర్ మాట్లాడుతూ.. పరిసరాల పరిశుభ్రత ప్రతి ఒక్కరి బాధ్యత అని, అందులో భాగంగానే తమ సంస్థ ఆధ్వర్యంలో ప్రతి ఏటా ఉద్యోగుల భా గస్వామ్యంతో 'స్వచ్ఛతా పక్వాడా' కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ పారిశుధ్య కార్యక్ర మాలు 15 రోజుల పాటు కొనసాగుతాయన్నారు. కార్యక్రమంలో పవర్ గ్రిడ్ చీఫ్ మేనేజర్ చంద్రమౌ ళి, అనిల్, జేఈ కలీముల్లా, గ్రిడ్ సిబ్బంది తదితరు లు పాల్గొన్నారు.



## ఉచిత కంటి వైద్య శిబిరం

**అక్షరటుడే, ఎల్లారెడ్డి:** ఎల్లారెడ్డి ప్రభుత్వ ఆస్పత్రి లో జిల్లా అంధత్వ నివారణ సంస్థ ఆధ్వర్యంలో గురువారం ఉచిత కంటి వైద్య శిబిరం నిర్వహిం చారు. 41మందికి కంప్యూటర్ ద్వారా కంటి పరీక్షలు చేశారు. 8 మందికి మోతిబిందు ఉన్నట్లు గుర్తించారు. వారిని శస్త్ర చికిత్సల నిమిత్తం బాన్సు వాడ లయన్స్ ఆస్పత్రికి రిఫర్ చేశారు. మరో 17 మందికి కంటి అద్దాల అవసరం ఉన్నట్లు గుర్తించి, వారికి త్వరలో అద్దాలు అందజేస్తామని నిర్వా హకులు తెలిపారు. ఈ సందర్భంగా ఆఫ్తాల్మిక్ ఆఫీసర్ హరికిషన్ కళ్లను కాపాడుకునే జాగ్రత్త లను వివరించారు కార్యక్రమంలో ఆస్పత్రి సూప రింటెండెంట్ డాక్టర్ రవీంద్ర మోహన్, వైద్యులు శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

## వేల్పూర్ ఆలయంలో వైభవంగా సాయి పల్లకీ సేవ



**అక్షరటుడే, భీమ్‌గల్ (వేల్పూర్):** మండల కేంద్రం లోని సాయిబాబా ఆలయ ప్రాంగణంలో సాయి పల్లకీ సేవను గురువారం భక్తులు వైభవంగా నిర్వ హించారు. ఈ సందర్భంగా భజన కళాకారులు ఆలపించిన ఆధ్యాత్మిక కీర్తనలు భక్తులను ఆకట్టు కున్నాయి. వేడుకల్లో భాగంగా ఆలయంలో గోమాత పూజను శాస్త్రోక్తంగా నిర్వహించారు. అనంతరం అన్నదానం చేశారు. ఆర్మూర్‌కు చెందిన కాపర్తి రజితసాయినాథ్, మోతెకు చెందిన స్రవంతిరాజారెడ్డి, పెర్కిట్‌కు చెందిన నచ్చు స్ర వంతిరాజశేఖర్ పుణ్య దంపతులు దాతలుగా వ్య వహరించారు. కార్యక్రమంలో ఆశ్రమాలయ వ్యవ స్థాపకులు గోవిందగిరి స్వామి, ఆలయ అభివృద్ధి కమిటీ సభ్యులు, భజన కళాకారులు, భక్తులు పా ల్గొన్నారు.

## జీలుగ విత్తనాల పంపిణీ



**అక్షరటుడే, ఆర్మూర్:** ఆలూరు మండలంలోని ప్రా థమిక వ్యవసాయ సహకార సంఘంలో, మాక్లూర్ పరిధిలోని కల్లెడ సొసైటీలో గురువారం జీలుగ విత్త నాలు పంపిణీ చేశారు. కల్లెడలో సొసైటీ అధ్యక్షుడు బుర్రోల్ల అశోక్, కల్లెడ సర్పంచ్ సుస్మిత ప్రళయ్ తేజ్ ఆధ్వర్యంలో విత్తనాల పంపిణీ జరిగింది. ఈ సంద ర్భంగా అశోక్ మాట్లాడుతూ రైతులు ఆధునిక పద్ధ తుల్లో సాగు చేపట్టి అధిక దిగుబడులు సాధించాలని సూచించారు. ప్రభుత్వం రైతుల అభివృద్ధికి అనేక సంక్షేమ కార్యక్రమాలు అమలు చేస్తోందని తెలిపారు. మండలంలోనే ముందుగా జీలుగ విత్తనాల పంపిణీ చేపట్టడంపై రైతులు హర్షం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో ఆలూరు మండల వ్యవసాయ అధికారి రాంబాబు, సంఘ డైరెక్టర్ పులమంటి గంగారాం, రైతులు నీలగిరి శ్రీనివాస్, శశి, మహేష్, నడ్పి గంగారాం తదితరులు పాల్గొన్నారు.

## బస్సు ఆపలేదని రాయితో దాడి.. కేసు నమోదు

**అక్షరటుడే, కామారెడ్డి:** బస్సు ఆపడం లేదని ఓ వ్యక్తి ఆగ్ర హంతో రాయి విసరగా బస్సు అద్దం పగిలిపోయింది. ఈ ఘటన కామారెడ్డి మున్సిపాలిటీ పరిధిలోని దేవునిపల్లి వద్ద గురువారం చోటు చేసుకుంది. కామారెడ్డి బస్టాండ్ నుంచి బస్సు ఉదయం 9 గంటలకు నిజాంసాగర్, పిట్లం ప్రయాణికులతో బయలుదేరింది. దేవునిపల్లి రాగానే భగత్ సింగ్ విగ్రహం వద్ద బస్సు కోసం ఎదురుచూస్తు న్న ఓ వ్యక్తి అటుగా వచ్చిన బస్సును ఆపాలని చేయి చూపించాడు. అయితే డ్రైవర్ బస్సును ఆపకుండానే ముందుకు తీసుకెళ్లాడు. అప్పటికే రెండు బస్సులు ఆపక పోవడంతో ఆగ్రహంతో ఉన్న ఆ వ్యక్తి ఓ రాయి తీసుకుని బస్సుపైకి విసిరాడు. ఆ రాయి నేరుగా బస్సు వెనకాల అద్దానికి తాకడంతో అద్దం పగిలి గాజుముక్కలు ప్రయా ణికులపై పడ్డాయి. దీంతో శివాజీ విగ్రహం వద్ద డ్రైవర్ బస్సును నిలిపేశాడు. విషయాన్ని డ్రైవర్ డిపోకు ఫిర్యాదు చేశాడు. దాంతో ఆర్టీసీ సిబ్బంది అక్కడికి చేరుకుని వివ రాలు తెలుసుకున్నారు. బస్సు ఆపకపోవడం వల్లే తాను బస్సు పైకి రాయి విసిరానని, బస్సు అద్దం పగులగొట్టా లని తన ఉద్దేశ్యం కాదని దాడి చేసిన వ్యక్తి తెలిపాడు. బస్సు పైకి రాయి విసరడం తప్పేనని, పగిలిన అద్దం ఖర్చు భరిస్తానని తెలిపాడు. విషయం పోలీసులకు చేరడంతో వారు ఘటనా స్థలానికి చేరుకున్నారు. ప్రభుత్వ ఆస్తుల ను ధ్వంసం చేయడం చట్టరీత్యా నేరమని పోలీసులు పేర్కొ న్నారు. దాడితో ప్రయాణికులకు ఎలాంటి గాయాలు కాక పోవడంతో అందరూ ఊపిరి పీల్చుకున్నారు. పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.



